క్లుప్తంగా

ఫర్నిచర్, డైరీల వితరణ



పాఠశాలకు అందించిన ఫర్నిచర్

సింహాద్రిపురం: మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. తాము చదివిన పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్, విద్యార్థులకు డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమను ఉన్నత స్థానాలకు చేర్చిన పాఠశాలకు ఈ విధంగా రుణం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అరుణ కుమారి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



ఎంఈఓతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

జమ్మలమడుగు: ఎర్రగుంట్ల మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈఓ మీనాక్షి గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రామానుజన్‌రెడ్డి, ఎంఈఓ శివప్రసాద్‌లతో సమావేశమై సూచనలు చేశారు. విద్యార్థులకు రావాల్సిన పథకాలు అందాయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా సామగ్రి యూనిఫాం, పుస్తకాలు, విద్యార్థులకు అందించారా అంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అడ్మిషన్లపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. రాబోయే ఏడాది పది పరీక్ష ఫలితాలను సాధించి విద్యార్థుల సంఖ్య పెంచేలా బోధన సాగించాలని సూచించారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కమలాపురం: కమలాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ



రైఫిల్ డ్రిల్‌లో శిక్షణ ఇస్తున్న మహేష్

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణ, చక్కటి శరీర సౌష్టవానికి డ్రిల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్.జి. రవీంద్రనాథ్ అన్నారు. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గురువారం ఎన్.సి.సి క్యాడెట్లకు రైఫిల్ డ్రిల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, వాయు సేన రంగాలలో ఎన్.సి.సి క్యాడెట్లకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ మహేష్, పరేడ్ శిక్షకులు వీరేంద్ర సింగ్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞాన ఫలాలు సామాన్యులకు అందించాలి



మాట్లాడుతున్న మహమ్మద్ మియా

మైదుకూరు : శాస్త్ర విజ్ఞాన ఫలాలను సామాన్యులను అందించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ సలహా మండలి నాయకుడు మహమ్మద్ మియా అన్నారు. గురువారం మైదుకూరులో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను నిర్వహించారు. మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహ్మద్ మియా మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానంతోనే మానవుని మనుగడ ముడిపడి ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి జన విజ్ఞాన వేదిక కార్యకర్త శాస్త్ర విజ్ఞాన ఫలాలను సామాన్యులకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో 2025–27 సంవత్సరాలకు జేవీవీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీఆర్ మల్లేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. మహాసభలో జేవీవీ నాయకులు ఏవీ రమణయ్య, ఖాజా హుస్సేన్, పార్వతి, గాయత్రి బృంద, శివప్రసాద్ రెడ్డి, సాంబశివరావు, మంజూరు బాషా, ధనుంజయ, వీరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది కలెక్టరేటేనా?



ఫుట్‌పాత్‌లపై మొలిచిన పిచ్చిమొక్కలు, గడ్డి



చెత్తాచెదారాల మధ్య కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన కడపలోని కలెక్టరేట్ ప్రతినిత్యం అధికారులు, ప్రజలతో కళకళలాడుతూ ఉంటోంది. జిల్లా ఉన్నతాధికారి కలెక్టర్ మొదలుకొని దాదాపు అన్నిశాఖల అధికారులు ఇక్కడి నుంచి ప్రభుత్వ కార్యకలాపాలు విదులు నిర్వహిస్తుంటారు. ఇటువంటి ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని పరిశీలిస్తే తీవ్ర ఆవేదన కలుగుతోంది. కలెక్టరేట్ ప్రధాన ద్వారం మొదలుకొని పలు ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. అలాగే కలెక్టరేట్ ఆవరణలోని ఫుట్‌పాత్ మరింత దారుణంగా కనిపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, గడ్డి ఫుట్‌పాత్‌పై మొలుస్తున్నా పట్టించుకునే అధికారే లేకుండా పోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించిన సత్వరమే కలెక్టరేట్ ఆవరణాన్ని శుభ్రపరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు నగర వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

బీసీలపై కూటమి నాయకుల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

వేంపల్లె: బీసీలపై కూటమి నాయకులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆరోపించారు. వేంపల్లెలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 50 ఏళ్లకే ఫింఛన్ ఇస్తామని చెప్పి నమ్మించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా బీసీలకు ఇచ్చిన పింఛన్ హామీ నెరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 50 ఏళ్లున్న బీసీలు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బీసీలపై చిత్త శుద్ధి ఉంటే వెంటనే ఇచ్చిన హామీ నెరవేర్చి పింఛన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న దస్తగిరి, ఆంజనేయులు, నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రబీ పంటలకు పరిహారం ఇవ్వాలి

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి



మస్తాన్ రెడ్డి

వేంపల్లె: ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, పత్తి, కంది, మినుము రైతులు పంటలు సాగుచేశారని, ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశారని తెలిపారు. వర్షాలు లేని కారణంగా పంటలు ఎండిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చిందని తెలిపారు. సాగు చేసిన పంటలకు దిగుబడులు రాకపోవడంతో పూర్తిగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై భారం పడకుండా బీమా చెల్లించిందని, కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, అన్నదాత సుఖీభవ ఇంతవరకూ రైతులకు అందించలేదన్నారు. ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ, పంటల బీమా విడుదల చేయాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

మొహర్రం వేడుకలకు పల్లెల్లో ఏర్పాట్లు



విభరాపురంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కమలాపురం: మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు పల్లెల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోని కుణాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, కె.అప్పాయపల్లె, గోవులాపురం, జీవంపేట, విభరాపురం, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, పొడదుర్తి తదితర గ్రామాల్లో కులమతాల కతీతంగా ప్రజలు మొహర్రం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పీర్ల చావిడిల్లో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తున్నారు. చెక్కెర చదివింపులు చేసి భక్తులకు పంచిపెడుతున్నారు. విభరాపురంలో నూతనంగా నిర్మించిన దర్గాలో మహమ్మద్ ప్రవక్త (స.అ.స.) మనుమళ్లు హసేన్, హుసేన్‌ల చిత్ర పటాలతోపాటు పీర్లను ప్రతిష్ఠించి బంగారు నగలతో అలంకరించారు. వీటిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. మహిళా భక్తుల చేతులకు నిర్వాహకులు మెహందీ వేసి, గాజులు ఉచితంగా అందజేశారు. అర్ధరాత్రి వరకూ పలు గ్రామాల్లో పీర్లను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. పీర్లు తమ ఇళ్ల వద్దకు వచ్చినపుడు భక్తులు ఫాతెహా నిర్వహించారు. పట్టణంలో పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

తరగతులు లేకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారు.?

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో బిఎడ్, లా కళాశాలలలో తరగతులు నిర్వహణ లేకుండానే బి.ఎడ్, లా పరీక్షలను ఎలా నిర్వహిస్తారని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ అన్నారు. గురువారం ఆర్ఎస్ఎఫ్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైవీయు పరిధిలోని బి.ఎడ్, లా కళాశాలలు ఏ ఒక్కటి కూడా అధ్యాపకులు లేకుండా, లైబ్రరీలు లేకుండా, బి.ఎడ్ ల్యాబ్ లు, తరగతి గదులు కూడా లేకుండా ఉన్నాయన్నారు. అసలు కొన్ని బి. ఎడ్ కళాశాలకు అయితే బిల్డింగ్‌లు కూడా లేవన్నారు. మరి కొన్ని కళాశాలలైతే యూనివర్సిటీ రికార్డుల్లో మాత్రమే కళాశాలల పేర్లు ఉంటాయని కనీసం కాలేజీల పేర్లు గల బోర్డులు కూడా ఉండవని ఆరోపించారు.

కానీ ఆయా బి. ఎడ్ కళాశాలలు ఏదో ఒక రూముల్లో రికార్డులు పెట్టుకొని, అడ్మిషన్స్ సమయంలో విద్యార్థుల సర్టిఫికెట్స్ పెట్టుకొని వారితో భారీ ఫీజులు వసూల్ చేసుకొని పరీక్షల సమయంలో మాత్రమే వైవీయు అధికారులతో ఒప్పందం చేసుకుని హాల్ టికెట్స్ జారీ చేసి విద్యార్థులను పరీక్షలను అనుమతిస్తున్నారన్నారు. తరగతులే నిర్వహించని కళాశాల విద్యార్థులను ఎలా పరీక్షలకు అనుమతిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు సిద్దిక్, సల్మాన్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

కొలువైన పీర్లు



గూడుమస్తాన్ వలి దర్గా వద్ద కొలువైన పీర్లు

జమ్మలమడుగు రూరల్: పట్టణంలో పలు చోట్ల పీర్లు కొలువుదీరాయి. పట్టణంలోని గూడుమస్తాన్ వలి దర్గా ఆవరణ, పెద్ద పోస్టాఫీస్, కోట వీధి, మిఠాయిగిరి వీధి, తదితర ప్రాంతాలలో నిర్వహకులు కుల మతాలకు అతీతంగా ఫాతహా నిర్వహించారు. భక్తులు పీర్ల వద్దకు తరలివచ్చి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. రాత్రి పీర్లను ఎత్తుకోని అగ్ని గుండంలో ప్రవేశించి భక్తిని చాటుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జావేద్

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డికె జావేద్ పేర్కొన్నారు. గురువారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల్లో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు తప్పని సరిగా హెల్మెట్‌ను పెట్టుకోవాలని సూచించారు. మహిళలు ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు డ్రెస్ చున్నీ, చీర కొంగు ప్రమాదవశాత్తు వీల్‌లో చిక్కుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావున తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అలాగే యువత ఓవర్ స్పీడ్, ర్యాష్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం వల్ల ప్రమాదకరమని హెచ్చరించారు. అందరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత తాము రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

గోపవరం : ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని గురువారం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డికి సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని మడకలవారిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 891, 892/1, 892/3, 812 లలో ఉన్న ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మడకలవారిపల్లె రెవెన్యూ పొలంలో అధిక స్థాయిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని కలెక్టర్, ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేష్ పిలుపిచ్చారు. గురువారం పోరుమామిళ్లలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయకార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కొరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ పేదల వలసలు నివారించడానికి తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఉపాధి చట్టాన్ని విస్తరించాలని, ఏడాదికి రూ. 2 లక్షల కోట్లు నిధులు కేటాయించాలని, 200 పనిరోజులు, రోజుకు రూ. 600 ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు వీరయ్య, మండల అధ్యక్షుడు సత్యమయ్య, దాసు, విజయమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

అట్లూరు : ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇ.రమణయ్య కోరారు. గురువారం మండల కేంద్రమైన అట్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

టెండరుదారులతో సమావేశం



టెండరుదారుల సమావేశంలో మాట్లాడుతున్న కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ స్టాల్స్‌లను కేటాయించేందుకుగాను టెండరుదారులతో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు గురువారం సమావేశం నిర్వహించయారు. కడప డిపో మేనేజర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీఎం మాట్లాడుతూ టెండరు నిర్వహించే దుకాణాల గురించి తెలియజేశారు. బస్టాండులోని రూములు, బహిరంగ ప్రదేశాలకు సంబంధించి ఈనెల 10వ తేదీన టెండరు ద్వారా కేటాయింపులు జరుగుతాయని ఆయన వివరించారు. ఈనెల 9వ తేదీ లోగా టెండర్లు దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ప్రతి టెండరు దారుడు నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కడప డిపో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, అధికారులు మంజుల, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రొగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు 14 బ్రాంచ్‌లు ఉన్నాయని, వాటిలో చాలా వాటికి క్రీడా మైదానాలు, పార్కింగ్ స్థలం వంటివి లేవన్నారు. దీంతోపాటు బస్ ఫీజు , యూనిఫామ్ ఫీజు, డెవలప్మెంట్ ఫీజు, బుక్స్ ఫీజు అంటూ విద్యను వ్యాపారం చేస్తూ ఉన్నారన్నారు. విద్యా హక్కు చట్టానికి భిన్నంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీచేస్తున్నారని ఆరోపించారు.

అనధికారిక నిర్మాణాలకు పరిహారం రాదు



తహసీల్దారుతో మాట్లాడుతున్న ఏఈ విశ్వనాథ్

జమ్మలమడుగు: జాతీయ రహదారిలో అనధికార నిర్మాణాలకు పరిహారం ఇవ్వరని ఏఈ విశ్వనాథ్ తెలిపారు. ఎర్రగుంట్ల తహసీల్దారు శోభన్‌బాబును గురువారం ఆయన కలిపి సమస్యను వివరించారు. ఆయన మాట్లాడుతూ ముద్దనూరు నుంచి ఎర్రగుంట్ల మీదుగా కడపకు నేషనల్ హైవే నిర్మాణం కోసం ఇప్పటికే పూర్తి స్థాయిలో మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పరిహారం వస్తుందనే ఆశతో హైవేకు ఇరువైపులా అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరినట్లు తెలిపారు. ముద్దనూరు–కడప హైవే కోసం 380 ఎకరాల భూమి కావాల్సి ఉండగా, అందులో ఎర్రగుంట్ల మండలంలోనే 195 ఎకరాల భూమి కావాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే ఈ వివరాలతో సహా మొత్తం ప్రతిపాదనలు పంపామని, అనధికార నిర్మాణాలకు పరిహారం రాదని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని వివరించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

తొండూరు: మండల కేంద్రమైన తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపక పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మురళీ ధరరావు తెలిపారు. ఎమ్మెస్సీ(బాటనీ)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 5వ తేదీలోగా విద్యార్హతా ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలన్నారు. ఈ నెల 7న ఉదయం 11గంటలకు డెమో క్లాస్, ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లీలాధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బీటెక్ సీఎస్ఈ–ఐటీ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన వారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8985061341 నెంబర్‌కు ఫోన్ చేస్తే వివరాలు తెలుస్తాయన్నారు.

● పైపులు పగిలి.. నీరు వృథా



పులివెందుల మండలం అచ్చివెళ్లి గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న నీటి ట్యాంక్ బోరు నుంచి ఏర్పాటు చేసిన పైపులు పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఇదంతా చూస్తున్న సిబ్బంది పైపులకు మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు ఇలా గుడ్డ చుట్టి వదిలేశారు. అయినా నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైపు మార్చి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– పులివెందుల రూరల్

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల: పట్టణంలోని భాకరాపురంలో వద్ద గల దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కు శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రివర్గాలు తెలిపాయి. చర్మ వ్యాధుల వైద్య నిపుణులు ఆస్పత్రి చేరుకుని సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు వచ్చి చెవిలో చీము కారుట, చెవినొప్పి, శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపీ, సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు వైద్య చికిత్స చేస్తారు. అంతేగాక స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నిజాయితీ అధికారిని బదిలీ చేయవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పక్షపాతి కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను బదిలీ చేయాలనే ఆలోచనను అటు ప్రభుత్వం, ఇటు నాయకులు విరమించుకోవాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. రామాంజనేయులు కోరారు. గురువారం కడపలోని జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీతి నిజాయితీ, సమర్థవంతమైన పాలనతో విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాలను పాఠశాల స్థాయిలో ఖచ్చితంగా అమలు పరచే సమర్థవంతమైన అధికారి డీఈఓ అన్నారు. ఇలాంటి మంచి అధికారిని బదిలీ చేస్తున్నారనే వార్తలు రావడం ఏ మాత్రం మంచిదికాదన్నారు. ఉపాధ్యాయులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు అవుల శ్రీనివాసులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఆలమూరు ప్రసాద్, షేక్ సలాం పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్ అహ్మద్ బాషా (బాబు భాయి) అన్నారు. గురువారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపులో భాగంగా వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏఓ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా తయారైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను కోరారు. వక్ఫ్ పరిరక్షణ జేఏసీ కడప సిటీ కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నగర జమియతుల్ ఉలేమా కార్యదర్శి మౌలానా సలావుద్దీన్, మజ్లిసే ఇల్మియా నాయకులు మౌలానా షబ్బీర్, జమియతే అహ్లే హదీసు సభ్యులు అన్వర్, కాంగ్రెస్ పార్టీ నసీరుద్దీన్, సి.పియం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ నాయకుడు ప్రసాద్, ఎస్.డి.పి.ఐ నగర అధ్యక్షుడు జాబిర్ అలి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొండాయపల్లి శిశు గృహ పరిశీలన



చిన్నారితో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ కడప నగరం కొండాయపల్లిలోని శిశు గృహను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన శిశు గృహలోని పిల్లల వివరాలను, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన పలు చట్టాలను గురించి తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

దేవుని కడపలో వారాహి దేవి మహా శాంతి యాగం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : లోక కల్యాణార్థం, లోక క్షేమార్థం వారాహి దేవి మహా శాంతి యాగం నిర్వహించామని అర్చక సమైక్య జిల్లా అధ్యక్షులు విజయభట్టర్ అన్నారు. కడప జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక కడప జిల్లా విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత మందిర ఏపీబీఎస్ఎస్ఎస్ బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో వరాహి దేవి మహా శాంతి యాగం నిర్వహించామని తెలిపారు. దేవుని కడపలోని శ్రీ వేదమాత గాయత్రి దేవస్థానంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శాంతి యాగం నిర్వహించి భక్తులకు వేద ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇంద్రకంటి ప్రభాకర్ శర్మ, కళ్యాణపురం విజయ బట్టర్, సరస్వతుల శివ సత్య కుమార్ శర్మ, సిద్ధవటం రవి ప్రసాద్ శర్మ, జగన్నాథం మురళీ శర్మ, మధురభారతం సుధీర్ శర్మ, సాగర్ శర్మ, పాల్గొన్నారు.